ఉద్యమమే ఊపిరిగా..

- పదేండ్లు మినహా తక్కిన కాలమంతా రణగర్జనే
- చీల్చిన చోటే.. చిచ్చరపిడుగులా కేసీఆర్ మహాగర్జన
- నేడు బీఆర్‌ఎస్ 24వ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా అవతరించి యావత్‌దేశాన్ని మంత్రముగ్ధం చేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 23 ఏండ్ల క్రితం జలదృశ్యంలో పురుడుపోసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తన లక్ష్యాన్ని ముద్దాడటం ఓ అపూర్వఘట్టం. 23 ఏండ్ల ప్రస్థానంలో దాదాపు 14 ఏండ్లు రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం సాగించి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్, రాష్ట్ర ఆవిర్భావ అనంతరం తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తొమ్మిదిన్నరేండ్లపాటు అధికారంలో కొనసాగింది. ఆ స్వల్పకాలంలోనే పరిపాలనలో అద్భుతాలు చేసి చూపించింది. అనేక రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్ది తెలంగాణ కీర్తిని ఎలుగెత్తి చాటింది. బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు లిఖించిన ఆ అసాధారణ చరిత్రకు భవిష్యత్తు లేకుండా చేస్తాననే వాదనలు ఇప్పుడే కాదు, అప్పుడూ వినిపించాయి. అసలు పార్టీ నే లేకుండా చేస్తామన్న వాళ్లు, చేయాలని కుతూహలం ప్రదర్శించినవాళ్లు చతికిలపడిపోవడం, ఈ గడ్డ నుంచి వేరుపడిపోవడం మన కండ్ల ముందే జరిగింది. అసమాన వ్యూహ చతురత, అద్వితీయ కార్యదీక్షగల కేసీఆర్ చేతిలో బీఆర్‌ఎస్ పదిలంగా పదునెక్కి ముందుకు సాగుతున్నది. 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో ఎగురవేసిన గులాబీ జెండా దిగ్విజయంగా 23 ఏండ్లు పూర్తిచేసుకొని 24వ ఏట అడుగుపెడుతున్నది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అస్తిత్వమే ప్రాతిపదికగా ఏర్పడిన బీఆర్ఎస్ అనేక ఎత్తుపల్లాలను చవిచూసింది.

బీఆర్‌ఎస్ ఏది చేసినా సంచలనమే

పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఏది చేసినా సంచలనమేనని బీఆర్‌ఎస్ నిరూపిస్తూ వస్తున్నది. చెల్లాచెదురుగా ఉన్న తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి స్వరాష్ట్ర సమరంలో భాగస్వాములను చేసింది. దేశ రాజకీయాల్లో తమకు ఎదురేలేదని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ పరాజయభారాలతో బిక్కచచ్చిపోయిన వేళ, 2004 లో బీఆర్‌ఎస్‌తో పెట్టుకున్న పొత్తే ఆ పార్టీకి ప్రాణం పోసింది. 'తెలంగాణ కోసం గొంగలి పురుగునైనా ముద్దు పెట్టుకుంటా, కుష్టురోగినైనా కౌగిలించుకుంటా'అని నాడు కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్పించిన ఘనత కేసీఆర్‌దే. ఆనాడు ముందుచూపుతో అనుసరించిన వ్యూహమే 2009 డిసెంబర్ 9 ప్రకటనకు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసింది. 2001లో కరీంనగర్‌లో నిర్వహించిన సింహగర్జన బహిరంగసభ నుంచి, 2010 డిసెంబర్ 16న వరంగల్‌లో నిర్వహించిన తెలంగాణ మహాగర్జన దాకా తెలంగాణలోని దాదాపు ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ డివిజన్‌లోనూ కేసీఆర్ నిర్వహించిన బహిరంగసభ లెన్నో. బస్తీ బాట, పల్లెనిద్ర, తండానిద్రా ఇలా అనేక రూపాల్లో దాదాపు 14 ఏండ్లపాటు అవిశ్రాంత పోరాటం సాగించారు.

చీలికల కుట్రలు, ఫిరాయింపులు కొత్తేమీ కాదు

రాష్ట్ర ఆవిర్భావం తరువాత 2014 జూన్‌లో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ 2023 డిసెంబర్ వరకు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోగానే ఇక ఆ పార్టీ పని అయిపోయిందనే వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించడం మొదలైంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌తోపాటు కొద్దిమంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్‌ఎస్ పార్టీని వీడారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్‌ఎస్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని, ఆ పార్టీ నుంచి గెలిచిన వారిని ఎవ్వరినీ మిగలనీయమని, 25 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ మంత్రులు భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఇలాంటి ఆటుపోట్లు బీఆర్‌ఎస్‌కు కొత్తకాదు. ఎన్నో కుట్రలను తిప్పికొడుతూ నిలిచి గెలిచింది. బీఆర్‌ఎస్ (నాటి టీఆర్‌ఎస్) పార్టీ పుట్టిన మూడు నాలుగేండ్లకే ఆ పార్టీ ఎమ్మెల్యేలను 2005లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చీల్చింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేవీపీ ఇద్దరూ కలిసి టీఆర్‌ఎస్‌ను చీల్చుతున్నారంటూ నాటి ఎమ్మెల్యే కాసీపేట లింగయ్య (బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాకపోయినా) ప్రకటించి కాంగ్రెస్ కుయుక్తులను బయటపెట్టారు. జయప్రకాశ్‌రెడ్డి, బండారు శారారాణి, కంభంపాటి లక్ష్మారెడ్డి, సోయం బాపూరావు, నారాయణరావు పటేల్, మందాటి సత్యనారాయణరెడ్డి, దుగ్యాల శ్రీనివాసరావు సహా 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ కొనుగోలు చేసిందని గ్రహించిన తెలంగాణ సమాజం వారిని ద్రోహులుగా ప్రకటించి ఊరూరా ఉద్యమాలు చేసింది. ఆ తరువాత 2009లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిసి తెలంగాణ అగ్నిగుండమైంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడం, కేసీఆరే పాలనా బాధ్యతలు స్వీకరించడం, వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడం ఎన్నటికీ మరుపురాని చరిత్ర.

నాడు, నేడు నాగర్‌కర్నూల్‌లో..

21 ఏండ్ల క్రితం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కాకతాళీయమో, యాదృచ్ఛికంగానో నాగర్‌కర్నూల్‌లో ఉన్నారు. 2003 సెప్టెంబర్ 15న నాగర్‌కర్నూల్ నగారాతో నల్లమలకొండల్లో జై తెలంగాణ నినాదం మార్మోగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేసీఆర్ నేడు (శనివారం) కూడా నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షోలో పాల్గొనున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం ప్రసంగించనున్నారు.

పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ

బీఆర్‌ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం అన్ని జిల్లాల పార్టీ కార్యాలయాల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీ యావత్తు నిమగ్నమైన నేపథ్యంలో ఆవిర్భావ వేడుకలను జిల్లా కార్యాలయ కేంద్రంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా పార్టీ కార్యవర్గంతోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. 2001 ఏప్రిల్ 27న తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పుట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధిం చి, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం పార్టీ అహర్నిశలు కృషి చేసిందని వివరించారు. తెలంగాణభవన్‌లో ఉదయం 9 గంటలకు పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించనున్నారు.

తెలంగాణ అస్థిత్వం బీఆర్‌ఎస్

- స్వరాష్ట్ర సాధన గమ్యాన్ని చేరాం
- పదేండ్ల పాలనలో ప్రజలకు ప్రగతి ఫలాలు
- పార్టీ శ్రేణులకు ఆవిర్భావ శుభాకాంక్షలు: కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల స్వరాష్ట్ర పోరాటాలను గమ్యానికి చేర్చిన తెలంగాణ అస్థిత్వ రాజకీయ పార్టీ భారత రాష్ట్ర సమితి (నాటి తెలంగాణ రాష్ట్ర సమితి) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు, రాష్ట్ర ప్రజలకు, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ.. ప్రత్యేక రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడి, పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించిందని తెలిపారు. తద్వారా దేశం గర్వించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. ఇది ప్రజాస్వామిక వాదులందరికీ, ముఖ్యంగా తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని వివరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు 23 ఏండ్లుగా పార్టీ ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. ప్రజల స్వరాష్ట్ర స్వయంపాలన ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో దారి, దరి దొరకని స్థితిలో ఉన్న తెలంగాణ సమాజానికి, ప్రజాస్వామిక పార్లమెంట్ పంథాలో దిక్సూచిగా నిలిచిందని తెలిపారు. వేల సంఖ్యలో, పలు స్థాయిల్లో నాయకత్వాన్ని తీర్చిదిద్ది రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, ప్రగతి పథంలో రాష్ట్రాన్ని నడిపించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి, ఆ పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందని వెల్లడించారు. ప్రపంచ రాజకీయ పార్టీల చరిత్రలో బీఆర్‌ఎస్‌ది ప్రత్యేక స్థానమని కొనియాడారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ, పలు మైలురాళ్లు అధిగమించడానికి బలమైన పునాదులు వేసింది పార్టీ కార్యకర్తలేనని స్పష్టం చేశారు. ప్రజలతో, మేధావివర్గాలతో మమేకమై కొనసాగించిన వారి ఉద్యమ అంకితభావమే నేటి తెలంగాణ ప్రగతికి కారణమని శ్లాఘించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు దన్నుగా నిలుస్తూ, ప్రజల ఆదరణ మరింతగా పొందేందుకు నాయకులు, కార్యకర్తలు ఈ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతినబూనాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌ను వీడేది లేదు

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

హనుమకొండ, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి తన రాజకీయ గురువని, తనను సొంత కుటుంబ సభ్యుడిగా చూసుకున్నారని సారయ్య తెలిపారు. ఆయన కుమారుడు రఘురాంరెడ్డికి ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కితే మర్యాదపూర్వకంగా అతడిని కలిసేందుకు ఖమ్మం వెళ్లినట్టు తెలిపారు. ఆర్ఎస్‌ది, తనది గురుశిష్యుల బంధమని, రాజకీయాలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. తాను కాంగ్రెస్‌లో నాయకుడిగా ఎదగడంలో సురేందర్‌రెడ్డి పాత్ర కీలకమని, కష్టనష్టాల్లో తనకు వెన్నుదన్నుగా ఆర్ఎస్ నిలిచారని పేర్కొన్నారు. మర్యాదపూర్వకంగా కలిస్తే పార్టీ మారబోతున్నట్టుగా ప్రచారం చేయడం తగదని అన్నారు. తాను బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తానని సారయ్య స్పష్టం చేశారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- అమరవీరుల త్యాగాలు ఆయనకేం తెలుసు?
- సమైక్యవాదుల ప్రతినిధిగా వ్యవహరిస్తుండు
- సీఎం పదవి రాజీనామాకు సిద్ధం కావాలి
- రేవంత్ జై తెలంగాణ అనలేదు
- హరీశ్‌రావుకు రాజీనామాలు ఏమైనా కొత్తనా?
- బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అమరవీరులను, అమరవీరుల స్థూపాన్ని అవమానపర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాల గురించి, అమరవీరుల స్థూపం గురించి రేవంత్‌రెడ్డికి ఏం తెలుసని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి లాంటి వారి వల్ల అమరవీరుల ఆత్మ ఘోషిస్తున్నదని విమర్శించారు. వారి త్యాగాలను అవమానించే విధంగా మాట్లాడిన ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్థూపాన్ని తాకే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదని స్పష్టంచేశారు. అమరవీరుల స్థూపం చరిత్ర ఏం తెలుసునని, కొందరు రేవంత్ చెంచాలు, బచ్చగాళ్లు అమరవీరుల స్థూపం మలినమైందని శుద్ధి చేస్తారా? అని ఫైరయ్యారు. ఏ కార్యక్రమం మొదలు పెట్టాలన్నా బీఆర్‌ఎస్ ముందుగా అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పిస్తామని, స్థూపాన్ని దైవంతో సమానంగా భావిస్తామని చెప్పారు. అమరవీరుల త్యాగాల గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడటం చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని మండిపడ్డారు. ఒక్కనాడైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నావా? ఒక్కనాడైనా జై తెలంగాణ అన్నవా..రేవంత్‌రెడ్డి? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని, చంద్రబాబుకు, సమైక్యవాదులకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు పదవులకు రాజీనామా చేయమంటే పారిపోయింది మీరు కాదా? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన మీరా.. తెలంగాణ ఉద్యమకారుల గురించి మాట్లాడేది అని ప్రశ్నించారు. పదవులను గడ్డిపోచలా వదులుకున్న చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీకి ఉన్నదని స్పష్టంచేశారు. హరీశ్‌రావుకు రాజీనామాలు ఏమైనా కొత్తనా? అని ప్రశ్నించారు.

కొడంగల్లో ఓడిపోతే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నదెవరు?

1969 కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగంగానే ఆనాడు 369 మంది అమరులు అయ్యారని, అందుకే వారికి నివాళులుగా అమరవీరుల స్థూపాన్ని కట్టుకున్నామని ఎర్రోళ్ల చెప్పారు. అమరవీరుల స్థూపం 2014 ముందు హైదరాబాద్‌లో మాత్రమే ఉండేది, కానీ ప్రతి నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రజలు స్వచ్ఛందంగా నిర్మించుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ లేకపోతే ముఖ్యమంత్రి అయ్యేవాడివా... తెలంగాణ రాకపోతే అదే సమైక్యవాదుల అడుగులకు మడుగులు వత్తే వాడివని రేవంత్‌పై నిప్పులు చెరిగారు. గతంలో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, మాటతప్పి మళ్లీ మల్కాజిగిరిలో పోటీచేసింది నువ్వు కాదా? అని రేవంత్‌ను నిలదీశారు. పంద్రాగస్టున 2 లక్షల రుణమాఫీతోపాటు 8 గ్యారెంటీలు అమలు చేయాలని, లేదంటే కొడంగల్ ప్రజలను మోసం చేసినట్టుగా అందరినీ మోసం చేసినట్టుగా తెలంగాణ ప్రజలు భావిస్తారని చెప్పారు.

కేసీఆర్ తలకాయ మేం తీసేయాలా?

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధికారంలో ఉండగా 'తల నరుక్కుంటా' అని చెప్పి అనేక హామీలు అమలు చేయలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు మొదటి సీఎంను దళితుడిని చేయకపోతే మెడ నరుక్కుంటా అని కేసీఆర్ పది లక్షల సార్లు అన్నారని, రెండుసార్లు అధికారంలోకి వచ్చినా చేయలేదని పేర్కొన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. 'నువ్వు తలకాయ తీసేయలేదు కదా.. మమ్మల్ని తియ్యమంటవా? లేకపోతే దళితులు తలకాయ తీయాలా?' అని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రైతులపై ప్రేమ ఉన్నట్టు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాజీనామా పత్రం ఒకటిన్నర లైన్ మాత్రమే ఉండాలని, ఒకటిన్నర పేజీ రాసుకొచ్చారని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే రుణమాఫీ చేసేందుకు ప్రయత్నించామని, బ్యాంకులకు డబ్బు చెల్లించాల్సి రావడంతో వీలుకాలేదని పేర్కొన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ హామీ నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

నేనొచ్చా.. నువ్వెక్కడ రేవంత్?

- రాజీనామా సవాల్‌కు ఎందుకు వెనకాడుతున్నవ్?
- రావట్లేదంటే.. ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నట్టే లెక్క
- అమరుల స్థూపం వద్దకు రాలేకపోతే పీఏతో పంపు
- ఉద్యమ జర్నలిస్టుల చేతుల్లో నా రిజైన్ లెటర్ పెడుతున్న
- హామీలు అమలు చేసి, నా రాజీనామా ఆమోదించుకో
- తర్వాత వచ్చే ఉప ఎన్నికల్లో కూడా నేను పాల్గొనను
- గన్‌పార్క్ వద్ద మాజీమంత్రి హరీశ్‌రావు ఓపెన్ చాలెంజ్

సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ చేసి శుక్రవారం తన రాజీనామా పత్రంతో అమరవీరుల స్థూపం వద్ద మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో వివిధ పత్రికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల యాడ్‌లను చూపుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, వివేకానంద, తలసాని శ్రీనివాస్, బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి గారూ! అమరవీరుల స్థూపం దగ్గరికి వచ్చేశా. ఇదిగో నా రాజీనామా లేఖ. నువ్వెక్కడ? ఎందుకు వెనకడుగు వేస్తున్నవ్? రాజీనామాకు ముందుకు రావటం లేదంటే ఈ రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నట్టే' అని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు.. శుక్రవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి తన రాజీనామా పత్రాన్ని ఉద్యమ జర్నలిస్టుల చేతుల్లో పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'తెలంగాణలోని నా అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్, నా నిరుద్యోగ సోదరులకు రూ.4 వేల భృతి, మా రైతన్నలకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుబంధు, వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్, మా ఆడబిడ్డలకు రూ.2,500 ఆగస్టు 15లోపు అమలు చేయండి. ఇవేమీ నేను కొత్తగా అడుగుతున్నవి, మా గొంతెమ్మ కోర్కెలేమీ కావు. ఎన్నికల్లో మీరు బాండు పేపర్లపై రాసిచ్చిన హామీలు. వీటన్నింటినీ నెరవేర్చి నా రాజీనామాను ఆమోదించుకోండి. లేకపోతే మీరూ రాజీనామా చేయండి' అని సీఎం రేవంత్‌కు ఓపెన్ చాలెంజ్ చేశారు. రేవంత్ చివరికి దేవుళ్లను కూడా వదలకుండా ప్రమాణాలు చేస్తూ.. రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేది నిజమే అయితే గన్‌పార్క్ దగ్గరకు రావాలని డిమాండ్ చేశారు. 'ఇక్కడ అమరుల సాక్షిగా ప్రమాణం చేద్దాం. మేధావులు లేదా జర్నలిస్టుల చేతుల్లో ఇరువురి రాజీనామాలు పెడదాం. ఆగస్టు 15లోగా ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ, వందరోజుల్లో అమలు చేస్తామని బాండుపేపర్లపై రాసిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేస్తే.. నా రాజీనామా పత్రాన్ని నేరుగా స్పీకర్‌కు ఇవ్వండి. నేను మళ్లీ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేయను. ఇదే విషయం స్పష్టంగా చెప్తాను. ఒక వేళ ఆరు గ్యారెంటీలు, రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే మీ రాజీనామాను గవర్నర్‌కు ఇవ్వడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?' అని సూటిగా ప్రశ్నించారు.

రావట్లేదంటే.. మోసం చేస్తున్నట్టే లెక్క

దేవుళ్లపై ప్రమాణం చేసి, ఒట్లు పెట్టుకొని, బాండ్లుపేపర్లపై రాసిచ్చిన హామీలు నిజమే అయితే.. రాజీనామా చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాజీనామాకు ముందుకు రావటం లేదంటే.. ప్రజలను మరొక్కసారి మోసం చేస్తున్నట్టేనని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఏనాడూ అమరవీరుల స్థూపం వద్దకు రాలేదని గుర్తుచేశారు. 'ఇక్కడ కొచ్చి రెండు పూలు పెట్టింది లేదు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించిన చరిత్ర మీకు లేదు. ఇది మా దురదృష్టం. మీరు గన్‌పార్క్‌కు రావడం, రాకపోవడం మీ విజ్ఞత. ఒకవేళ మీరు రాకపోతే, అమరుల స్థూపం వద్దకు పూలు సమర్పించాల్సి వస్తుందేమోనన్న భేషజాలు ఉంటే.. కనీసం మీ స్టాఫ్ ద్వారానైనా మీ రాజీనామా పత్రం ఇక్కడ పెట్టండి. నేను ఇక్కడుండే జర్నలిస్టులకే నా రాజీనామా లేఖను ఇచ్చి వెళ్తున్నా.. మా జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమకారులు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు, మేధావులు అద్భుతంగా పోరాడారు. వాళ్ల చేతుల్లోనే నా రాజీనామా లెటర్ పెడుతున్నా. నువ్ అన్ని హామీలు అమలు చేస్తే వారు నేరుగా నా రాజీనామాను స్పీకర్‌కు ఇవ్వొచ్చు. ఒకవేళ మీరు కూడా ఇలాగే లెటర్ పెడితే అది మీ పెద్దరికాన్ని నిలబెడతది. ఒకవేళ మీరు రాజీనామా లెటర్ ఇవ్వకపోతే మీరు దేవుళ్ల పేరు మీద ప్రజలను మోసం చేస్తారని భావించాల్సి వస్తుంది. ప్రధాన ప్రతిపక్షంగా మా ఆశ, మా ప్రయత్నం రాష్ట్రంలోని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించటమే. అదే మా కర్తవ్యం. నేను రాజకీయాలకు అతీతంగా, స్వచ్ఛందంగా ముందుకొచ్చాను. నేను స్పీకర్ ఫార్మాట్‌లో కూడా రాజీనామా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా' అని వెల్లడించారు. తమకు రాజకీయాలకంటే, ఎమ్మెల్యే పదవి కంటే పేద ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయించే బాధ్యత తమదని, నాడు స్వయంగా సోనియాగాంధీ లేఖ రాశారని గుర్తుచేశారు. డిసెంబర్ 9న తొలి సంతకం ఆరు గ్యారెంటీల మీద పెడతామని, రుణమాఫీపై పెడతామని చెప్పి మాట తప్పినందుకు రేవంత్‌రెడ్డి ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఆగస్టు 15లోగా నైగా అన్ని హామీలు నెరవేస్తే సంతోషమేనని తెలిపారు.

హరీశ్ సవాల్‌ను స్వీకరించాలి: తలసాని

చెప్పినమాట ప్రకారం మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా లేఖ తీసుకొని వచ్చారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సీఎంకు ధైర్యం ఉంటే హరీశ్ రాజీనామా సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాకపోయినా సీఎం రేవంత్‌కు తీరిక ఉన్నప్పుడు గన్‌పార్క్‌కు వచ్చి సవాల్ స్వీకరించాలని అన్నారు. ఓట్ల కోసం లేనిపోని హామీలు ఇస్తామంటే కుదరదని, డిసెంబర్ 9న ఇస్తామన్న రుణమాఫీ ఏమైంది? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి దంపతులు, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా హరీశ్‌రావుకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు గన్‌పార్క్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపగా.. పోలీసులు రోప్ పార్టీతో వారిని చెదరగొట్టారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు అమరులకు నివాళి అర్పించారు.

హరీశ్ లేఖ యథాతథంగా..

గౌరవనీయులైన తెలంగాణ శాసన సభాపతి గారికి..

విషయము : శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 2 లక్షల రూపాయల రుణమాఫీ హామీతో పాటు ఆరు గ్యారంటీల్లోని మొత్తం పదమూడు హామీలు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు ఆగస్టు 15న అమలు చేస్తే, నేను నా శాసనసభ్యత్వానికి అదే రోజు రాజీనామా చేసినట్టు పరిగణించి ఆమోదం తెలపాలని కోరటం గురించి..

2023లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల రూపంలో ప్రజలకు 13 హామీలు ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వీటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఇవికాకుండా 2023 డిసెంబర్ 9 నాడు రైతులకు ఉన్న రూ.2 లక్షల వరకు రుణమాఫీ కూడా చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 140 రోజులు దాటినా మహాలక్ష్మి పేరిట ప్రతి నెలా 18 ఏండ్లు దాటిన వారందరికీ రూ.2,500 చొప్పున ఇస్తామన్న హామీ నేరవేరలేదు. రైతుభరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున, రైతు కూలీలకు ఏటా రూ.12 వేల చొప్పున చెల్లించటం, పంటలకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించటం అనే హామీలు నెరవేరలేదు. ఇందిరమ్మ ఇండ్ల కింద 5 లక్షల రూపాయలివ్వడం, ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం ఇవ్వటం ఆచరణకు నోచుకోలేదు. యువ వికాసం కింద 5 లక్షల రూపాయల విలువైన విద్యాభరోసా కార్డు ఇస్తామని, ప్రతి మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. చేయూత కింద ఇచ్చిన హామీ అయిన ఆసరా పెన్షన్లను 2 వేల రూపాయల నుంచి 4 వేల రూపాయలకు పెంచటం కూడా అమలు కాలేదు. రూ.2 లక్షల రుణమాఫీ హామీని ఆగస్టు 15లోపు అమలు చేస్తానని దేవుడిపై ఒట్లు తింటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ హామీతో పాటు వంద రోజుల్లో పూర్తి చేస్తామని చేయలేని గ్యారంటీలను కూడా ఆ రోజులోగా నెరవేర్చాలని డిమాండ్ చేశాను. ఆగస్టు 15లోగా నెరవేర్చకపోతే సీఎం రాజీనామా చేయాలని నెరవేర్చితే నేను రాజీనామా చేస్తానని సవాల్ విసిరాను. నా సవాల్‌కు కట్టుబడి నేను ఈ రాజీనామా ప్రతిపాదన లేఖను మీ ముందు ఉంచుతున్నాను. 2024 ఆగస్టు 15లోగా పైన పేర్కొన్న హామీలన్నింటినీ అమలుచేసిన పక్షంలో ఈ లేఖను నా రాజీనామాగా పరిగణించి ఆమోదించాలని కోరుతున్నాను.

ఇట్లు...
తన్నీరు హరీశ్‌రావు, శాసనసభ్యుడు, సిద్దిపేట

అమరవీరులకు కాంగ్రెస్ అవమానం

- చెప్పులేసుకొని అమరుల స్థూపంపై స్పీచ్‌లు
- ఒక్క పువ్వుతోనూ నివాళి అర్పించని నేతలు
- బీఆర్‌ఎస్ పూలదండలను ఊడ్చేసిన ఇందిరా
- హస్తం నేతల నుంచి వినిపించని 'జై తెలంగాణ'

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలు పవిత్రంగా భావించే గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ నాయకులు అవమానకర రీతిలో ప్రవర్తించారు. అమరుల త్యాగాలను లెక్కచేయకుండా చెప్పులేసుకొని స్థూపం వద్ద హంగామా సృష్టించారు. ఏకంగా చెప్పులేసుకొనే స్థూపం గద్దె పైకి ఎక్కి మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీశ్‌రావు తన రాజీనామా పత్రంతో గన్‌పార్క్‌కు వచ్చి నివాళులు అర్పించిన అనంతరం.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతృత్వంలో పలువురు నాయకులు అమరుల స్థూపం శుద్ధిపేరుతో నానా యాగి చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున కనీసం ఒక్క పువ్వును కూడా అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించలేదు. కానీ, బీఆర్‌ఎస్ నాయకులు అమరులకు సమర్పించిన పూలను కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఇందిరా శోభన్ ఊడ్చిపడేశారు. పూల దండలను పక్కకు విసిరివేశారు. పువ్వులను చేతులతో కాకుండా కాళ్లతో నెడుతుండగా, కాంగ్రెస్ నాయకురాలు కొండ్రడు పుష్పలత కాలుజారి కిందపడ్డారు. పక్కనే ఉన్న మీడియా ప్రతినిధులు ఆమెను లేపి, సపర్యలు చేశారు. పసుపు నీళ్లతో స్థూపాన్ని శుద్ధిచేసే క్రమంలో కాంగ్రెస్ నాయకులు తమపై నీళ్లు చల్లుకున్నారు. అనంతరం అమరుల స్థూపం మెట్లపై చెప్పులు వేసుకుని మీడియాతో మాట్లాడేందుకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముందుకు రాగా.. తప్పు తెలుసుకొని చెప్పులు విప్పేసి మాట్లాడారు.

స్థూపంపై చెప్పులతోనే స్పీచ్‌లు..

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతుండగా కాంగ్రెస్ మహిళానేత, సినీనటి దివ్యవాణి చెప్పులతో అమరుల స్థూపం పైకి ఎక్కారు. ఆమెతోపాటు మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ సైతం షూతో నిలుచొనే మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ పక్కన ఉన్న మరో నేత కూడా స్థూపంపై చెప్పులు ధరించే మాట్లాడారు. ఒక్క కాంగ్రెస్ నేత, కార్యకర్త కూడా 'జై తెలంగాణ' అని నినదించలేదు.